బ్యాంకు ఖాతాలకు 'ఆధార్' లింక్ తప్పనిసరి

- బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి చేసిన కేంద్రం
- ప్రారంభమైన ప్రక్రియ.. ఈ నెల 30 వరకు గడువు

యలమంచిలి: వెంకట్రావు మూడెకరాల రైతు. అతను ప్రభుత్వానికి ధాన్యం ఎగుమతి చేసినా అతని ఖాతాకు డబ్బులు జమ కావడం లేదు. సుబ్బారావు ఇతను పాడి రైతు ప్రభుత్వ పాల కేంద్రానికి పాలు వేస్తున్నా అతని బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ కావడం లేదు. విజయలక్ష్మి డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకుని వారం రోజులయ్యింది. ఆమె ఖాతాకు డబ్బులు జమ కావడం లేదు. సమస్య ఏమిటా అని ఆరా తీస్తే వీరందరికీ బ్యాంకు ఖాతా ఉన్నా ఆ ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానం కాలేదని తేలింది. దీంతో వారి బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ కావడం లేదు. ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నగదు రాయితీలు ప్రకటిస్తున్నాయి. రాయితీ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసే అవకాశం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్‌పీసీఐ) చూసుకుంటుంది. దేశ వ్యాప్తంగా ప్రజలందరి బ్యాంకు ఖాతా నెంబర్లు తీసుకోవడం కష్టం కనుక ఎన్‌పీసీఐ ఆధార్ నెంబర్‌తో వారి ఖాతాలకు డబ్బులు జమ చేస్తుంది. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఉన్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నగదు రాయితీలు నేరుగా వారి ఖాతాలకు జమవుతుంటే, ఆధార్ అనుసంధానం లేని ఖాతాలకు డబ్బులు పడడం లేదు. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీల పరిధిలో ఎవరి బ్యాంకు ఖాతాలకు అయితే ఆధార్ అనుసంధానం కాలేదో ఆ జాబితాలను పంచాయతీలకు పంపించింది. ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం మనుగడలో లేని ఖాతాలను బతికించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 30వ తేదీలోగా పునరుద్ధరణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.


ఆధార్ అనుసంధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

జిల్లాలో 2.50 లక్షల ఖాతాలు

పశ్చిమ గోదావరి జిల్లాలో 25 మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో నివాసముంటున్న వారందరికీ బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ, వారిలో 2,50,654 ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. వారి జాబితాను ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలకు పంపారు. ఆ జాబితాను తీసుకుని సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమస్య వివరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని వివరిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన కేంద్రం నుంచి వచ్చిన జాబితాలో జిల్లాలో 2,50,654 మంది బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని వారు ఉండగా సచివాలయ సిబ్బంది 10 రోజుల్లో 45,331 మంది ఖాతాలను పునరుద్ధరించారు. ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఇంకా 2,05,323 మంది ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయవలసి ఉంది.

మండలంలో 9115 ఖాతాలు

యలమంచిలి మండలంలోని గ్రామ పంచాయతీల్లో 9115 బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో వారికి ఆయా సచివాలయాల సిబ్బంది 2497 బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేశారు. ఇంకా మండలంలో 6618 మంది ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయవలసి ఉంది.

పోస్టాఫీసులో రూ.200లకే ఖాతా

18 ఏళ్లు నిండిన వారికి కూడా కొత్త ఖాతా తీయించాలని కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అయితే రూ.1000 చెల్లిస్తే కాని బ్యాంకు కొత్త ఖాతా తెరవరు. దీంతో అంత మొత్తం చెల్లించలేని వారి కోసం పోస్టాఫీసుల్లో రూ.200లకే కొత్త ఖాతా తెరిచే అవకాశం ఉండటంతో అక్కడ కొత్త ఖాతాలు తీయిస్తున్నారు.

> **బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో లింక్ చేసుకోవాలి**
>
> 
>
> ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖాతా మనుగడలో ఉండాలి. కొందరికి రెండు, మూడు ఖాతాలు ఉంటే వాటిలో కొన్ని వినియోగంలో లేకపోవటంతో సమస్యలు వస్తున్నాయి. దీంతో మనుగడలో లేని ఖాతాల వివరాలు పునరుద్ధరించుకునేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ లేనట్లు గుర్తించింది. వారందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందించి లింక్ చేసుకోవాలని సూచిస్తున్నాం.
>
> – నందిపాటి ప్రేమాన్విత, ఎంపీడీఓ, యలమంచిలి

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



క్షీరారామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన క్షీరారామలింగేశ్వర స్వామిని కార్తీక సోమవారం పురస్కరించుకుని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే అంతరాలయంగా ఉన్న జనార్ధన స్వామి, పార్వతీ, లక్ష్మీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకస్వాములు గోత్రనామాలతో పూజలు చేసి ప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, బాకూరి సత్య నిరంజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు

పెనుమంట్ర: సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పెనుమంట్ర సివిల్ సప్లై గోడౌన్ ఎదుట కూలీలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోడు శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ సివిల్ సప్లైకార్మికులకు ఎగుమతి, దిగుమతి కూలి రేట్లు పెంపుదల చేసి ఏడాది దాటిందని, తక్షణమే కూలి రేట్లు పెంచాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు, జి.ఆంజనేయులు, కె.శ్రీరామచంద్ర, బి.నాగేశ్వరరావు, కె.చినవెంకటేశులు, బి.ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అప్పారావు

పాలకొల్లు సెంట్రల్: మన నిత్య జీవితంలో న్యూటన్ గమన నియమాలు అనేవి ఒక భాగంగా ఉంటాయని హెచ్‌ఓడీ ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ ఏపీవీ అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక చాంబర్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఫిజిక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో భౌతికశాస్త్రం అనేది చాలా ప్రాముఖ్యమైన శాస్త్రమన్నారు. ఇందులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. విద్యార్థులు భౌతిక శాస్త్రంలో వచ్చే నూతన మార్పులను గమనిస్తూ వాటికి అనుగుణంగా విద్యను అభ్యసించాలని తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, ఫిజిక్స్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, బి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన హోంగార్డు మృతి


మామిడిశెట్టి ఏడుకొండలు (ఫైల్)

మొగల్తూరు: మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో హోమ్ గార్డుగా విధులు నిర్వహిస్తున్న మామిడిశెట్టి ఏడుకొండలు (53) ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై జి.వాసు సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని శేరేపాలెం గ్రామానికి చెందిన ఏడుకొండలు 1994లో హోమ్‌గార్డుగా బాధ్యతలు చేపట్టాడు. అయితే గత కొంత కాలంగా ఏడుకొండలు షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడని ఈ నెల 16వ తేదీ శనివారం విధులు ముగించుని వెళ్లిన ఏడుకొండలు ఇంటికి వెళ్లకపోవడంతో భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. బంధువులు, కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించినా జాడ తెలియలేదు. అయితే ఆదివారం సాయంత్రం కొత్తోట ఉప్పుటేరులో ఓ మృతదేహం తీరానికి వచ్చిందని సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు ఏడుకొండలు మృతదేహంగా గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టు మార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు. సోమవారం ఏడుకొండలు మృతదేహానికి సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జి.వాసు, పోలీస్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు వైద్య శిబిరం ఏర్పాటు

పెనుగొండ: తేతలి వారి వీధిలో బ్రహ్మకుమారీస్ (ఓంశాంతి) ఆధ్వర్యంలో ఈ నెల 20న బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కూటమి బ్యానర్లకు కోడ్ వర్తించదా ?


జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఫ్లెక్సీ

నరసాపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ అధికార పార్టీకి చెందిన బ్యానర్లు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. దీంతో వాటికి ఎన్నికల కోడ్ అడ్డురాదా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. కోడ్ పేరుతో నరసాపురం పట్టణంలోనూ, మండలంలోని గ్రామాల్లో పలు చోట్ల బ్యానర్లు తొలగించినప్పటికీ అధికార పార్టీకి చెందిన బ్యానర్లు జాతీయ రహదారి పక్కనే దర్శనమిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు, ప్రచార రాతలు వంటివి ఎక్కడా ఉండకూడదు. అయినప్పటికీ జాతీయ రహదారి పక్కనే ఉన్న భారీ హోర్డింగ్, బ్యానర్లు అటుగా వెళ్లే అధికారులకు సైతం కనపడకపోవడం గమనార్హం.

శివాలయాల్లో వెల్లివిరిసిన కార్తీక శోభ


నరసాపురం: గోదావరి వలందర్ రేవులో దీపాలు వదులుతున్న భక్తులు


పాలకొల్లు సెంట్రల్: మహన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

పలు ఆలయాల్లో శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు

మొగల్తూరు: కార్తీకమాసం మూడో సోమవారం మండలంలోని శివాలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. వేకువ జాము నుంచి భక్తులు ఆలయాలకు తరలి వచ్చి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలోని ధ్వజ స్థంభం వద్ద, ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు వన మల్లిఖార్జునస్వామి ఆలయం, పేరుపాలెం, ముత్యాలపల్లి, కాళీపట్నం, కొత్తపాలెం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శివనామ స్మరణతో..

యలమంచిలి: కార్తీక మూడో సోమవారం శైవక్షేత్రాలు తెల్లవారు జాము నుంచే కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. మండల కేంద్రమైన యలమంచిలి ఉమా సోమేశ్వరస్వామి, గుంపర్రు గ్రామంలోని సర్వ మంగళ పార్వతీ సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయాలకు భక్తులుపోటెత్తారు. మేడపాడు గ్రామంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, బిల్వార్చన పూజలు, క్షీరాభిషేకం తదితర పూజలు చేశారు.

క్షీరారామం.. భక్త జనసంద్రం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు శివనామస్మరణతో పులకించారు. భక్తులు స్వామి వారికి వేకువ జాము నుంచే మహన్యాసపూర్వక అభిషేకాలు ప్రారంభించారు. మహిళలు కాలువ స్నానాలు ఆచరించి కాలువలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, పట్టణ సీఐ కె.రజనీకుమార్, ఎస్సై పృథ్వీ, పోలీసు, సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్, ఆలయ సిబ్బంది సేవలందించారు.


పెనుగొండ: సిద్ధాంతం కేదారీఘాట్‌లో కార్తీక స్నానాలు


పెనుమంట్ర: నత్తా రామేశ్వరంలో శ్రీస్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు


యలమంచిలి: మేడపాడు శివాలయంలోని ఉమారామలింగేశ్వరస్వామి


మొగల్తూరు: శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు


నరసాపురం రూరల్: కార్తీకమాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోదావరి తీరాన కార్తీక సోమవారం పూజలు

నరసాపురం: కార్తీకమాసం సోమవారం పూజలు ఘనంగా నరసాపురం వశిష్ట గోదావరి తీరాన ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి గోదావరి ఘాట్‌లు భక్తులతో కిక్కిరిశాయి. గోదావరిలో దీపాలు వదిలారు. కపిల మల్లేశ్వరస్వామి ఆలయం, గోదావరి గట్టున ఉన్న అమరేశ్వర స్వామి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

విరాజిల్లిన కార్తీక శోభ

పెనుగొండ: కార్తీక సోమవారం ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లో కార్తీక శోభ విరాజిల్లింది. మూడవ సోమవారం ఆయా మండలాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రసిద్ధి గాంచిన ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయంలో భక్తులు శివనామస్మరణతో హోరెత్తించారు. పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.వడలిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు.

భక్తి శ్రద్ధలతో శివుడికి పూజలు

పెనుమంట్ర: కార్తీకమాసం ఉత్సవాల్లో భాగంగా శివుడికి ప్రీతికరమైన రోజు సోమవారం పలు శైవ క్షేత్రాల్లో స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. కాశీ క్షేత్రాలతో సమానంగా ప్రసిద్ధి గాంచిన జుత్తిగ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి వారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

ఆలయాలు కిటకిట

నరసాపురం రూరల్: కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో నరసాపురం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు లక్ష్మణేశ్వర రేవులోని వశిష్ఠ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి చాగంటి సురేష్‌నాయుడు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొప్పర్రు శివాలయంలో పూజలు నిర్వహించారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

నరసాపురం: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలు నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో సోమవారం ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. లైబ్రేరియన్ కేజేఎల్ఎల్ కుమారి, ఎం.సుధీర్‌బాబు, అల్లూరి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్‌కు గ్రంథాలయాల ఉపయోగాలు, సీనియర్స్‌కు సెల్‌ఫోన్ వినియోగం, లాభ నష్టాలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం డిజిటల్ లైబ్రరీలపై సమావేశం ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయాధికారిణి శాంతకుమారి తెలిపారు. కార్యక్రమంలో కేవీవీ సత్యనారాయణ, యు.పెద్దిరాజు, సీతారాం, సూర్యకుమార్, చేగొండి రంగారావు, పి.విజయలక్ష్మి, భవానీ, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

పెనుమంట్ర: సత్యవరం గ్రామంలో శ్రీభగవాన్ బుద్ధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో ద్విస్వరాలతో భక్తి గీతాలను ఆలపిస్తూ పలు రాష్ట్రాల అభిమానులను భక్తి గీతాలతో రంజింప చేస్తున్న తాళ్లూరి బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ఉన్నమట్ల మునిబాబు మాట్లాడుతూ విద్యా, కళా రంగాలకు చెందిన మాణిక్యాలను గత 25 సంవత్సరాలుగా వెలికి తీస్తూ ప్రోత్సహిస్తున్న బుద్ధ సేవా సమితి సభ్యులు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ఉన్నమట్ల వెంకట్రావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఆర్థిక సహకారంతో 40 మంది పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు తాడిపర్తి సంపత్‌రావు, కార్యదర్శి కేతా రామకృష్ణ, దళిత గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మట్టి చంద్రప్రసాద్, వార్డు సభ్యులు గెడ్డం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలే మేలు

మొగల్తూరు: ఏ విధమైన రసాయనాలు వేయకుండా జీవామృతం, కషాయాల ద్వారా పండించిన కూరగాయలు తినడం వలన ఆరోగ్యానికి మేలు జరగుతుందని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మొగల్తూరు కుక్కలవారితోటలో పండించిన వంకాయ, బీరకాయ, దొండకాయ, బెండకాయ, ఆనపకాయ, తోటకూర తదితర కూరగాయలు, ఆకుకూరలను అమ్మారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన కార్యాలయాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు పండించేలా చర్యలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బందికి సూచించారు. తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య, ఇతర శాఖల సిబ్బంది కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.లక్ష్మీ కుమారి, ఆర్.పుష్ప, యు కనక దుర్గాభవాని, ఎం.దుర్గా భవాని, పి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కూరగాయలు కొనుగోలు చేస్తున్న అధికారులు

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: దేశవ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 4న ఓఎంఆర్ షీట్ల ద్వారా జాతీయ స్థాయి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈవీఎస్ఎస్ఎల్ నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ 2024 ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో బలాలు, బలహీనతలు, లోపాలు గుర్తించి అభ్యసన లక్ష్యాలను చేర్చుకోవడానికి ఏ చర్యలు చేపట్టాలనే ఉద్దేశ్యంతో ఈ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీలు బండి ఆంజనేయులు, కోటి వెంకట కుమార్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. ఏఎస్ఎన్ఎం కళాశాల నుంచి శిక్షణ పొందిన విద్యార్థులకు పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, పోడూరు, యలమంచిలి మండల పాఠశాలల్లో సర్వే పరీక్ష నిర్వహిస్తామన్నారు.

రాజకీయ వేధింపులను అరికట్టాలి

పెనుగొండ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఇటీవల కాలంలో రాజకీయ వేధింపులు పెరిగాయని ఆ సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీఐటీయూ నాయకులు మద్దతిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సూర్నిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మెనూ చార్జీలు ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలన్నారు. అదే విధంగా రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పని చేసే శానిటరీ వర్కర్ల (ఆయా) వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు జి.అనితకుమారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, వంట కార్మికులు పాల్గొన్నారు.


తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులు

ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు


కార్యక్రమంలో ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీవో దాసిరాజు చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 15 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎంతో దూరం నుంచి సమస్యలు చెప్పుకుంటున్న ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.